అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వివరాలు 2లో..


# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 04, సెప్టెంబర్-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## అసెంబ్లీలో మీ సమస్యే మా తొలి ప్రాధాన్యత..



వివరాలు 3లో..

## 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



- 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వ్యతిరేకంగా మల్లికార్జున నగర్ గ్రౌండ్లో సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

వివరాలు 2లో..

## కొండా సురేఖ వ్యవహారంపై స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



వివరాలు 2లో..

## జీవో 97 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి



- తలసాని శ్రీనివాస్ యాదవ్

వివరాలు 3లో..

## చంద్రబాబు అపర భగీరథుడు



- ఏపీ సస్యశ్యామలం కాబోతోంది
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

వివరాలు 3లో..

## అధికారంలో కొనసాగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు :

వివరాలు 2లో..

# 14లోపు సాగర్ నీళ్లివ్వకపోతే..

# మహా పాదయాత్ర..

- ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్





**హైదరాబాద్, సెప్టెంబర్ 03:** 'సెప్టెంబర్ 14 వినాయక చవితిలోపు సాగర్ ప్రాంత రైతులకు నీళ్లు ఇచ్చే షెడ్యూల్ విడుదల చేయాలి. లేకపోతే వేలాది మంది రైతులతో కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తా' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ప్రభుత్వా నికి అల్టిమేటం జారీచేశారు. సాగర్ ఎడమ కాల్వ కింద మిర్యాలగూడ నుంచి మధిర వరకు రైతుల పంటలు ఎండిపోతు న్నాయని, ఆ ప్రాంత రైతులందరికీ సాగర్ నీళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై మిర్యాలగూడలో నిర్వహించిన 'రైతు మహాధర్నా' కార్యక్రమానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ పదేండ్ల పాలన చూశారు.. వెయ్యి పడగల విషమున్న పాము కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను కూడా ప్రజలు చూస్తున్నారని చెప్పారు. మిర్యాలగూడలో భాస్కర్‌రావు, జగదీశ్‌రెడ్డిలు నాగార్జునసాగర్ నీళ్ల కోసం ధర్నా చేస్తే.. రేవంత్ సర్కార్‌కు చలి జ్వరం వచ్చిందని ఎద్దేవా చేశారు. 2003లో కూడా ఇదే కరువు పరిస్థితి ఉంటే.. కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేసి, అప్పుడున్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, నీళ్లు విడుదల చేయించడంలో పోరాటం చేసి విజయం సాధించారని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్‌లాగే.. తాను కూడా అలాగే ధర్నా చేయాలని జగదీశ్‌రెడ్డి సూచించారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. వేలాదిగా రైతన్నలు తరలివచ్చి మరొకసారి సత్తా చాటారని కేటీఆర్ కొనియాడారు.



## పార్టీలో అభిప్రాయభేదాలు సహజమే

- కాంగ్రెస్‌లో కుమ్ములాటలు కొత్తేమీ కావు..
- హద్దులు దాటితే అధిష్ఠానం చూసుకుంటుంది
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెల్లడి

4లో..

## సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించాల్సిందే

- లేదంటే కోదాడ..హాలియా పాదయాత్ర : కేటీఆర్



**మిర్యాలగూడ సెప్టెంబర్ 03:** నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ 14న వినాయకచవితిలోపు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనను, మిర్యాలగూడలో (గురువారం సాయంత్రం నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు.. ఎప్పుడెప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాగర్‌లో నీళ్లున్నా మంత్రులకు సోయి లేదని విమర్శించారు. శ్రీశైలంలో 537 అడుగుల నీరు ఉందని కేటీఆర్ అన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. సాగర్‌లో నీళ్లు ఉన్నా జిల్లాలోని మంత్రులకు సోయి లేదని విమర్శించారు. సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇద్దరు మంత్రులు శనిలాగా దాపురించారని వ్యాఖ్యానిం చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ రైతుల కళ్లలో కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి

మిగతా 3లో..

## బీసీ మంత్రి బర్తరఫ్..

- పదవి నుంచి కొండా సురేఖకు ఉద్వాసన



**హైదరాబాద్, సెప్టెంబర్ 03:** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖపై బర్తరఫ్ వేటు పడింది. ఆమెను క్యాబినెట్ నుంచి తొలగిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పంపిన సిఫారసుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు సురేఖ తొలగింపును ఖరారు చేస్తూ లోక్ భవన్ అధికారిక గెజిట్ విడుదల చేసింది. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఇతర బీసీ నేతలను వెంటేసుకొని స్వ యం గా లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనల నేపథ్యంలో కొండా సురేఖ బర్తరఫ్‌ను తక్షణమే ఆమోదించాలని కోరారు. సీఎంతో భేటీ ముగిసిన కొద్దిసేపటికే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పిస్తున్నట్టు రాజ్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే సచివాలయంలోని నాలుగో ఫ్లోర్‌లో ఉన్న సురేఖ కార్యాలయాన్ని జీఏడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పార్టీలోని సీనియర్లు, ప్రశ్నించే గొంతులను తొకిపెట్టే వ్యూహానికి రేవంత్‌రెడ్డి సరార్ పదును పెట్టింది.

మిగతా 3లో..

## చిన్నారెడ్డి ఔట్..

- గద్వాల్ విజయలక్ష్మి రీప్లేస్



**హైదరాబాద్, సెప్టెంబర్ 03:** కాంగ్రెస్ సర్కార్ కొండా సురేఖను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్‌గా డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేసి ఆయన స్థానంలో గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు.తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారదను నియమించారు. కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ ఎంపీ గుండు సుధారాణి

మిగతా 3లో..

## ప్రజల కోరిక మేరకు ప్రజాప్రభుత్వం పాలన



- మంత్రి పొంగులేటి
- 1000 రోజుల్లో సంక్షేమానికి లక్షా 76వేల కోట్లు ఖర్చు

**హైదరాబాద్, సెప్టెంబర్ 03:** ప్రజల కోరిక మేరకు ప్రజాప్రభుత్వం పాలన చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 3475 రోజుల్లో చేసిన 8లక్షల 20వేల కోట్లు అప్పులకు ప్రతి నెలా రూ. 6500కోట్లు అప్పు చెల్లిస్తూనే సంక్షేమం అభివృద్ధి పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బుధవారం సచివాలయంలో మంత్రులు

మిగతా 3లో..

## సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలి



- టీజీఈజేఏసీ డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

వివరాలు 3లో..

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్..




**హైదరాబాద్, సెప్టెంబర్ 03:** హైదరాబాద్ నగర శివారు కొంపల్లిలో భారీగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.19 లక్షల విలువైన 1.9 కిలోల అల్ప్రాజోలం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు మాజీ ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడం గమనార్హం. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి జయభేరి పార్క్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, ఆ ప్రాంతంలో నిఘా పెట్టి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి అల్ప్రాజోలంతో పాటు రూ.40,000 నగదు, ఒక కారు, ఒక బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు మాజీ ఎక్సైజ్ కానిస్టేబుల్ గొల్ల రమేశ్ సూత్రధారిగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అతడిపై గతంలోనే మూడు ఎన్డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయి

## కాంగ్రెస్ లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను



- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో..

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



దేవరుప్పుల, సెప్టెంబర్ 03: దేవరుప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ)లో రూ.38 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, శానిటేషన్ మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ.. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థినులకు మరింత సౌకర్యవంతమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ టాయి లెట్లు, శానిటేషన్ సౌకర్యాల అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి విద్యార్థులకు అన్ని విధాలుగా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డల విద్యకు పెట్టే ప్రతి రూపాయి వారి భవిష్యత్తుకు పెట్టుబడేనని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థినులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కేజీబీవీపాఠశాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం






- 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వ్యతిరేకంగా మల్లికార్జున నగర్ గ్రౌండ్లో సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 03: 1000 రోజుల పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 22ఖ నిషేధిత జాబితాలో ఉన్న నివాసితులు మరియు జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీలో ఉన్న ఎండోమెంట్ భూముల నివాసితులు మల్లికార్జున నగర్ యుఏఎల్సి లో ఉన్న నివాసితులతో గురువారం మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్లో గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్లికార్జున నగర్ లో నివాసముంటున్న యు ఎల్ సి సమస్య పరిష్కారానికి 118 జీవో ప్రకారం త్వరలో పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. అలాగే జయగిరి లక్ష్మీనరసింహ స్వామి నగర్ ఆలయ భూములలో నివాసముంటున్న నివాసితులకు త్వరలో విముక్తి కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద త్వరలో ఆర్యుబి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. అలాగే మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉన్న 22 నిషేధిత జాబితా ను తొలగించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్కు కలిసి వినతిపత్రం సైతం సమర్పించామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎన్ బీ సి చైర్మెన్ నంది



కంటి శ్రీధర్,ఎక్స్ హుడా చైర్మెన్ వీరేశం యాదవ్, విజయప్రసాద్ రెడ్డి,వెంకటయ్య, గోపాలరెడ్డి, అచ్యుతరావు, వాసంశెట్టి శ్రీనివాస్,రాముయాదవ్,పాల్గొన్నారు,

# జపాన్‌లో డ్రైవర్ ఉద్యోగాలు



## కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల: సెప్టెంబర్ 03: జపాన్‌లో అర్హులైన యువతకు డ్రైవర్ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జపాన్ సంస్థ ప్రతినిధులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఐడీటీఆర్ ప్రిన్సిపాల్ దురై మురుగన్‌తో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ (ఐడీటీఆర్)లో జపాన్ సంస్థ ప్రతినిధులు పర్యటించి శిక్షణ, ఇతర అంశాలను పరిశీలించారు. హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, ఇంగ్లిష్ భాషపై పట్టు ఉన్న 25 ఏళ్ల వయసు కలిగిన యువత ఈ శిక్షణకు అర్హులని కలెక్టర్ తెలిపారు. అర్హులైన యువత మండేపల్లిలోని ఐడీటీఆర్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో అవగాహన కార్యక్ర మాలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని జిల్లా రవాణా శాఖ, ఐడీటీఆర్ ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఎంపికైన వారికి ఐడీటీఆర్‌లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ, అనంతరం జపాన్ భాషలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణలో ఎంపికైన వారికి జపాన్‌లో నెలకు సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనంతో డ్రైవర్ ఉద్యోగం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం ఐడీటీఆర్ ప్రిన్సిపాల్‌ను 94421 25075 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జపాన్ సంస్థ ప్రతినిధులు ఓసీ బుచి, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బర్తరఫ్ చేయడంపై భగ్గుమన్నా కొండా సురేఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 03: మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ భగ్గుమన్నారు. టీడీపీ రక్తం ఉన్నోళ్లే ఇలాంటి కుట్ర రాజకీయాలు చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి పై ఆమె మండిపడ్డారు. అధిష్టానం ముందు తనను బర్తరఫ్ చేయకపోతే కాంగ్రెస్ నుంచి వెళ్లిపోతానని రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశాడని పేర్కొన్న సురేఖ రేవంత్ బ్రదర్స్, పొంగులేటి, వేం నరేందర్ రెడ్డి కలిసి తమను కావాలనే టార్గెట్ చేశారని వెల్లడించారు.క్యాబినెట్ మంత్రిగా వేటుకు గురైన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ తెలుగుదేశం (టీడీపీ) నుంచి వచ్చాడని, టీడీపీ రక్తం ఉన్నోళ్లే ఇలాంటి కుట్ర రాజకీయాలు చేస్తారని ఆమె ధ్వజమెత్తారు. మళ్లీ తనే సీఎం అవుతాననడం.. ఎమ్మెల్యే టికెట్లను సొంతంగా రేవంత్ ప్రకటించడం సరికాదని సురేఖ ఫైరయ్యారు. యాదాద్రి పాలకమండలిపై ఎవరి దగ్గరా చర్చించకుండా కమిటీ వేస్తే గొడవలు అయ్యాయని పేర్కొన్న ఆమె.. మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి పాలనతో సంతోషంగా ఉన్నారా? అంటే లేరని తనకు తెలుసునని మీడియాకు తెలిపారామె. ఈరోజు నాకు అన్యాయం జరిగింది, రేపు మీకూ జరుగుతుంది.. ఇప్పటికైనా బయటికి వచ్చి మాట్లాడండి అని సూచించారు.

# రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ పార్టీ



మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 03: రాష్ట్రంలోని అన్ని రంగాలను సర్వనాశనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పట్టిన శనిలా దాపురించిందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. జడ్చర్ల నియోజక వర్గం నవాబ్ పేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ రైతు గర్జనలో ఆయన మాట్లాడారు.సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని లూటీ చేస్తుంది. అంతర్గత కుమ్ములాటలు,వాటాల పంచాయితీతో కాంగ్రెస్ పార్టీ రోడ్డు న పడిందని విమర్శించారు. తెలంగాణ సొమ్ము ఢిల్లీకి మూటలు మోస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ంలో అడ్మినిస్ట్రేషన్ కుప్పకూలింది.. కనీసం మంచి నీళ్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతకావడం లేదని అన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలకు అండగా నిలిచేందుకు నిరసన కార్యక్రమాలు చేప ట్టామని వెల్లడించారు.రైతు సంక్షేమం కోసం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కేసీ ఆర్‌ను తిట్టడానికే రేవంత్ రెడ్డి మీటింగ్‌లు పెడుతున్నాడని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ చేపడితే పనులు పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టిందని దుయ్యబట్టారు.

# అధికారంలో కొనసాగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు :

## మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్





హైదరాబాద్, సెప్టెంబర్ 03: : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆ పార్టీ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం విధ్వంసంపై టేక్మాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప అధ్యక్షతన గురువారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే టేక్మాల్ చౌరస్తాలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు.రైతుల గోడును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీరు, ఎరువులు, విత్తనాలు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా జరగక, క్వింటాళ్ల కొద్దీ తరుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు.మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్న హామీ అతీగతీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై సచివాలయ ఉద్యోగుల నుంచి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, రైతుల వరకు అందరూ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన బాండ్ పేపర్ల హామీల ఆధారంగా రూపొందించిన బాకీ కార్డులను ప్రతి గ్రామంలోని ఇంటింటికీ పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, విజయ్, పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి, నాయకులు సిద్దయ్య, సలీం, భాస్కర్, బసంతరావు, రవి, గోవిందచారి, మాజీ ఎంపీపీ చింత స్వప్న, మాజీ ఎంపీటీసీ మోహన్, మాజీ సర్పంచులు భక్తుల వరలక్ష్మి, నాయికోటి సుప్రజ, సంగయ్య, శ్రీనివాస్, రాజు, మల్లేశం, తదితరులు ఉన్నారు.

# లా విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బార్ కౌన్సిల్‌కు లేదు..



## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 03: లా విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన అధికారం బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. వారు విద్యార్థులు అని, వారం తా సంబంధిత యూనివర్సిటీలు, విద్యా సంస్థల పరిధిలోని వస్తారని వెల్లడించింది. ఇటీవల నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల అంశంలో చెలరేగిన వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు తాజా సూచనలు చేసింది.హైదారాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో 2026 లా గ్రాడ్యుయేట్ విద్యార్థుల స్నాతకోత్సవం జరగాల్సి ఉంది. దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. అయితే, ఆయనను చీఫ్ గెస్టుగా రావడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. దీంతో కార్యక్రమం రద్దైంది. ఆ తర్వాత బెంగళూరు లా విద్యార్థులు కూడా ఇలాగే చేశారు. అయితే, నల్సార్ విద్యార్థుల వైఖరిపై బీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విద్యార్థుల్ని ఎన్‌రోల్ చేయకూడదని లాయర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విద్యార్థులు, న్యాయ కోవిదుల నుంచి వ్యతిరేకత రావడంతో వెంటనే ఆ నిర్ణయాన్ని బీసీఐ వెనక్కు తీసుకుంది.అయితే, సీజేఐ రాకను అడ్డుకున్న లా విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన హక్కు బీసీఐకి లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు లేదని వివరించింది. వారు విద్యార్థులు అని, వారిపై చర్యలు తీసుకునే హక్కు సంబందిత యూనివర్సిటీలకే ఉంటుందని పేర్కొంది. ఒకవేళ వారు అడ్వకేట్లుగా ఎన్‌రోల్ అయితే, అప్పుడు వారిపై చర్యలు తీసుకునేందుకు బీసీఐకి హక్కు ఉంటుందని వెల్లడించింది.

# కొండా సురేఖ బర్తరఫ్‌ను ఆమోదించిన గవర్నర్..!



హైదరాబాద్, సెప్టెంబర్ 03: మంత్రివర్గం నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్‌ను గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ఆమోదించారు. క్యాబినెట్ మినిస్టర్‌గా సురేఖను తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటన ద్వారా మీడియాకు వెల్లడించారు.తెలంగాణ ముఖ్యమంత్రి సలహా మేరకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తున్న దస్త్రాన్ని గవర్నర్ ఆమోదించారు. లోక్ భవన్ ప్రకటనగా ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మీడియాతో పంచుకున్నారు. దాంతో,సెప్టెంబర్ 3.. ఈరోజుతో సురేఖ మంత్రి పదవి ఊడింది. ఆమె ఇకపై కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా మాత్రమే కొనసాగనున్నారు. గత ఎన్నికల్లో సురేఖ వరంగల్ తూర్పు నుంచి శాసన సభ్యురాలిగా గెలుపొందారు.

## కొండా సురేఖ వ్యవహారంపై స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్ 03: తెలంగాణ రాజకీయాల్లో చర్చ నీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమ టిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు.ఈ విషయంలో పా ర్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణ యమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టంచేశారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాజగోపాల్ రెడ్డి మీడి యాతో మాట్లాడారు. “కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివే దిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టు బడి ఉండాలి” అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠా నమే పర్యవేక్షిస్తుందని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.తన పూర్తి దృష్టి కార్యకర్తల సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు.మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌కు లేఖ రాశారన్న వార్తలఈ రాజకీయ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఏసీబీకి చిక్కిన అటవిశాఖ బీట్ అధికారి



భద్రాద్రి, కొత్తగూడెం : రాష్ట్రంలో మరో ఇద్దరు లంచం తీసుకుంటూ ఏసీబీ (ACB) అధి కారులకు చిక్కారు.ఏసీబీ అధికారులు తెలి పిన వివరాల ప్రకారం భద్రాది జిల్లా ఆలపల్లి మండలం కాచనాపల్లి గ్రామానికి చెందిన ఫారెస్టు బీట్ అధికారి బానోత్ రవికుమార్ , ప్రైవేట్ వ్యక్తి పఠాన్ సాధిక్ ఖాన్ అనే ఇద్దరిని పట్టుకున్నారు.అటవి శాఖ పరిధిలో ఉండే పోడు భూముల్లో (ౣశీంబఝుఅంం ) వ్యవసాయం సాగుకు, ట్రెంచెస్ తవ్వకాలకు ఎలాంటి ఆటంకాలు సృష్టించవద్దని,పోడు భూములకు పట్టా చేసివ్వాలని ఫారెస్టు బీట్ అధికారిని మధ్యవర్తి ద్వారా సంప్రదించాడు. ఇందుకు రూ.30 వేలు డిమాండ్ చేశాడు.ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా వారి వ్యూహం మేరకు రామానుజగూడెంలో అటవి అధికారి బానోత్ రవికుమార్ ఆదేశాల మేరకు మధ్యవర్తికి లంచం డబ్బు అందజేశాడు. వెంటనే ఏసీబీ అతడిపై దాడి చేసి రూ.30 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి , కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు.

# (మొదటిపేజీ తరువాయి)

## సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించాల్సిందే

వెంకటరెడ్డి నీళ్లలో వాటర్ కలిస్తే సొరంగం కూలిపోయిందని అంటున్నా రని విమర్శించారు. కళ్లు ఉండి చూడలేని మంత్రులుగా వ్యవహరిస్తున్నారని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నా చూడడం లేదని అన్నారు.శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 40 నుంచి 50 టీఎంసీల నీరు సాగర్‌లోకి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. శ్రీశైలంలో గేట్లు తెరిచేలోపే సాగర్‌లోకి నీళ్లు వచ్చాయని, సాగర్‌లో రెండు పంటలకు నీళ్లు వచ్చాయని అన్నారు. ఈ సీజన్‌లో నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీరు ఉన్నదని, ఆ నీటిని విడుదల చేయడానికి సంపూర్ణ అవకాశం ఉందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను తెలంగాణ ప్రజలు చూశారని కేటీఆర్ అన్నారు. వెయ్యి రోజుల దుష్టపరిపాలన నిన్నటితో పూర్తయిందని, కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు.

## బీసీ మంత్రి బర్తరఫ్..

కొంతకాలంగా సాగుతున్న తెరవెనుక నాటకీయ పరిణామాలకు తెరదించుతూ మంత్రి కొండా సురేఖపై సీఎం వేటు వేశారు. మంత్రి పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని పంపిన సీఎం దూతల రాయబారాలను సురేఖ నిర్ద్వంద్వంగా తిరసరించడంతో రేవంత్‌రెడ్డి ఏమాత్రం సంకోచించకుండా ఆమెను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేస్తూ సిఫార్సు లేఖను లోక్‌భవన్‌కు పంపారు.సీఎం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి గురువారం సాయంత్రం ఈ లేఖను గవర్నర్ కార్యాలయంలో అధికారికంగా అందించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని తనదారికి తెచ్చుకున్న రేవంత్, చివరికి పంతం నెగ్గించుకొని ప్రజల్లో ఉన్న బలమైన బీసీ మహిళా నేతను మంత్రివర్గం నుంచి బయటకు పంపారు. ఆమెతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డిని పదవి నుంచి తప్పిస్తూ సీఎంవో కార్యాలయం నోట్ విడుదల చేసింది. తద్వారా అసలు కాంగ్రెస్ మీద ఇకపై వలస కాంగ్రెస్‌కు తిరుగులేదనే సంకేతాలు పంపినట్టయింది.

## ప్రజల కోరిక మేరకు ప్రజాప్రభుత్వం పాలన

పొన్నం ప్రభాకర్. వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్,ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బి ఆర్ ఎస్ బిజెపి ఏకమై ప్రభుత్వానికి అడ్డుతగులుతున్నా సంక్షేమాన్ని ఆపలేదన్నారు. బిఆర్ ఎస్ హయాంలో తీసుకొచ్చిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ, గత ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులను చెల్లించి మరింత సంక్షేమం అందిస్తున్నామని వివరించారు.కాళేశ్వరం కూలిన తర్వాతే రాష్ట్రంలో అత్యధిక ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. రైతుకి భరోసా,భద్రత కల్పించాం.పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి 72వేల నియామకాలు చేపట్టాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నిలబెట్టుకునేలా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందనీ పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలు చేయాల్సింది పోయి బిఆర్ఎస్ ప్రజల్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. సంస్కారహీనంగా మాట్లాడుతున్న బావ బావమర్దులను తెలంగాణ ప్రజలు సహించరని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిన రాష్ట్రాన్ని సరిచేసుకుంటూ పోతుంటే కారుకూతలు కూయటాన్ని ప్రజలు గమనిస్తున్నారని పొంగులేటి అన్నారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ ప్రజారంజక పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు.

## చిన్నారెడ్డి ఔట్..

నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.చాలా రోజులుగా మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ మంత్రి వర్గం నుండి ఆమెను తక్షణమే తొలగిస్తున్నట్టు సీఎంవో లేఖ విడుదల చేసిందని తెలిసిందే. బర్తరఫ్ లేఖను ఇప్పటికే గవర్నర్‌కు పంపినట్టు పేర్కొంది. ఈ మేరకు లోక్ భవన్ నుంచి కాసేపట్లో ఉత్తర్వులు రానున్నట్టు సమాచారం.

## ఐఐటీ విద్యార్థులకు 100 స్కాలర్‌షిప్‌లు

### ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 : ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అసోం ప్రభుత్వం తరఫున ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందించాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, ఈ స్కాలర్‌షిప్ పథకానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను తక్షణమే సిద్ధం చేయాలని ఐఐటీ గువాహటి డైరెక్టర్ సహా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐఐటీ గువాహటి కేవలం విద్యా సంస్థ మాత్రమే కాదని.. అసోంతో పాటు మొత్తం ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సవాళ్లకు ఆధునిక పరిష్కారాలు కనుగొనడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఉద్దేశించి సీఎం హిమంత బిశ్వ శర్మ ఇచ్చిన సందేశం అందరినీ ఆకట్టుకుంది. జీవితం అనేది అందరి కంటే ముందుండాలనే పరుగుపందెం కాదని, ఒకవేళ అందరికంటే వేగంగా వెళ్లలేకపోయినా ఎవరూ వెనుకబడిపోయినట్లు భావించాల్సిన అవసరం లేదని విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు వ్యక్తిగత సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

## మోదీ అనుకుంటే ప్రపంచపటం నుంచి పాక్‌ను తుడిచేయగలరు

### మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే

మహారాష్ట్ర,సెప్టెంబర్ 3 : షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు గ్రూప్ ఫొటో నుంచి భారత ప్రధాని మోదీ చిత్రాన్ని పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం ఎడిట్ చేసి తొలగించడంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం చేసిన ఈ చిల్లర చేష్టలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఏక్ నాథ్ షిండే... పాకిస్థాన్ చేసిన పని అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. వారు ఫొటో నుంచి మాత్రమే మోదీ చిత్రాన్ని తొలగించగలరని... కానీ మోదీ అనుకుంటే ప్రపంచపటం నుంచి పాకిస్థాన్‌ను లేకుండా చేయగలరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గతంలో పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఘోరానికి ఒడిగట్టినప్పుడు, మోదీ నాయకత్వంలో మన భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను, 11 ఎయిర్‌బేస్ క్యాంపులను ధ్వంసం చేసి వారిని మోకాళ్లపై నిలబెట్టాయని గుర్తుచేశారు. ఇటువంటి చవకబారు ట్రిక్కులతో భారత్‌తో కానీ, ప్రధాని మోదీతో కానీ ఆడుకోవాలని చూడవద్దని పాకిస్థాన్‌కు ఆయన హితవు పలికారు. కేవలం ఫొటో నుంచి మోదీని కట్ చేసినంత మాత్రాన దేశంలోనూ, అంతర్జాతీయ వేదికలపైనా ఆయనకు ఉన్న గుర్తింపు, స్థాయి ఎంతమాత్రం తగ్గబోవని ఏక్ నాథ్ షిండే స్పష్టం చేశారు.

## రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

### మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 03: తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మూడు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత బియ్యం పంపిణీపై మరింత అవకాశం ఉండకపోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఇంకా కోటా తీసుకోని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. 3 నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడం వల్ల ఏర్పడిన రద్దీ, పండుగ కారణంగా లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువు పొడిగించడం రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా మారింది. దీంతో రేషన్ బియ్యం తీసుకోలేని వారికి మరో అవకాశం లభించింది.

## జీవో 97 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

### తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, సెప్టెంబర్ 03: పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు కోసే జీవో 97 ను ప్రభుత్వం ఈ నెల 7 వ తేదీ లోగా ఉపసంహరించు కోక పోతే సీఎం రేవంత్ ఇంటిని ముట్టడిస్తామని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. గురు వారం ఇందిరా పార్కు వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ధర్నాకు హాజరై మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష మందికి పైగా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసే జిఓ 97 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని 20 రోజుల నుంచి విద్యార్థులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన ఆస్తుల కోసమే ముఖ్యమంత్రి జీవో 97 ను తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయాలనే దుర్మార్గపు ఆలోచనతోనే స్కిల్ యూనివర్సిటీకి బదలాయించాలని చర్యలు చేపట్టిందని మండిపడ్డారు.ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం తో నడిచే యూనివర్సిటీ కి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండే రెండేళ్లు మాత్రమే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ప్రైవేట్ వ్యక్తులకు పాలిటెక్నిక్ ఆస్తులను కట్టబెట్టేందుకు, తాకట్టు పెట్టేందుకు కుట్రలు చేస్తుందని స్పష్టం చేశారు. సీనియర్ ఐఎఎస్ ఆకునూరి మురళి వంటి వంటి వ్యక్తులు కూడా ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను సమర్థించడం బాధాకరం అన్నారు.జెన్ జీ చేసిన పోరాటానికి ప్రధానమంత్రి దిగొచ్చి కేంద్రమంత్రి చేత రాజీనామా చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని, అధైర్య పడొద్దని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

## అసెంబ్లీలో మీ సమస్యే మా తొలి ప్రాధాన్యత..

### పాలిటెక్నిక్ విద్యార్థులతో కేటీఆర్..



హైదరాబాద్, సెప్టెంబర్ 03: జీవో 97 కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై నల్గొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను చెప్పగా.. కేటీఆర్ మీకు మేమున్నామంటూ భరోసా నిచ్చారు.కేటీఆర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ మొదలవుతుంది.. మీ సమస్యనే మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటాం. ప్రభుత్వం ముందుకొచ్చి మీ సమస్యపై స్పష్టత ఇచ్చే దాకా వదిలిపెట్టం. వాళ్లు మీ పాలిటెక్నిక్ కాలేజీల భూములు ఎక్కడెక్కడైతే ఉన్నయో ఆ భూముల మీద కన్నేశారు. ఆ భూములు అమ్ముకోవడానికే ఈ డ్రామా. రేవంత్ రెడ్డికి తెలిసిందల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారమే కాబట్టి ఆయనకు వేరే ఎజెండా ఏం లేదు.. మీ పాలిటెక్నిక్ కాలేజీల కిందున్న భూములు ఎత్తుకొని పోవాలి. అందులో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉండే భూములు ఎత్తుకొని పోవాలి... దానికి లింక్ పెట్టి మిమ్మల్ని అందరినీ ఆగం చేస్తా ఉన్నడు. మాకు తిండి లేదు ఏం లేదు సార్ అని విద్యార్థులు అంటుంటే.. మాకొదిలి పెట్టండి.. వాళ్ల ప్రపోజల్ ముందుకు పోకుండా చూసుకునే బాధ్యత మాదని కేటీఆర్ హామీనిచ్చారు

## సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలి



- టీజీఈజేఏసీ డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 03: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల పెన్షనర్ల జేఏసీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలని, అలాగే ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీజీఈజేఏసీ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు, డిప్యూటీ సెక్రెటరీ జనరల్స్ డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్), బి. శ్యామ్ ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఉద్యోగుల జీవితాలకు భరోసానిచ్చే ఓపీఎస్‌ను పునరుద్ధరించే వరకు ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎస్. విక్రమ్ కుమార్, కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్, టీఎన్జీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం. సత్యనారాయణ గౌడ్, నాయకులు ఉమ, శైలజ, నజీర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కురాడి శ్రీనివాస్ కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. అలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీజీజేఎల్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పి.శోభన్‌బాబు ఉద్యోగుల డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. టీఎన్జీవో హైదరాబాద్ సిటీ చైర్మెన్ కట్టకూరి శ్రీకాంత్, కన్వీనర్ గందూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అబిడ్స్ భీమా భవన్ వద్ద, హెచ్ఓడీ ఉద్యోగుల ఆధ్వర్యంలో లంచ్ అవర్‌లో నిరసన చేపట్టారు. మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టోరేట్ వద్ద నిరసన తెలిపిన అనంతరం ఉద్యోగుల ప్రతినిధులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేసుకోవడమే తమ లక్ష్యమని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి, సెక్రెటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ తెలిపారు. సెప్టెంబర్ 1ని సీపీఎస్ విద్రోహ దినంగా పాటిస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ ప్రాంగణంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, వొడ్నాల రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దర్శన్‌గౌడ్, ఇంటర్మీడియేట్ బోర్డు అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, టీఏపీయూఎస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ హన్మంతరావు, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పి.రాధ, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భిక్షం, టీజీఆర్ఎస్ఏ- సీసీఎల్ఏ యూనిట్ నేతలు రాంబాబు, శ్రీకాంత్ రెడ్డి , మల్లేష్, వేంకటేశ్ వివిధ సంఘాల నేతలు రాబర్ట్ బ్రూస్, రామరాజు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం... బహుబలి గేట్ వద్ద తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్, ఆఫీసర్స్ అసోసియేషన్, ఉమెన్ వెల్ఫర్ అసోసియేషన్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అసెంబ్లీ, లోక్‌భవన్ ఉద్యోగుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. నల్ల రంగు దుస్తులు ధరించి ప్లకార్డులు పట్టుకొని సచివాల యంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌నాయక్ మాట్లాడారు. సీపీఎస్ ను రద్దు చేసి దాని స్థానంలో ఓపీఎస్ ను పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాముక కమలాకర్, చీటీ భూపతి రావు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న విద్రోహదినంగా పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారని చెప్పారు. నిజామాబాద్ ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మెన్ నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలపై టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మహాధర్నా కార్యక్రమానికి ఉద్యమ స్ఫూర్తితో తరలిరావాలని పిలుపు నిచ్చారు.

## కాంగ్రెస్ లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 03: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## చంద్రబాబు అపర భగీరథుడు

### స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

అమరావతి,సెప్టెంబర్3 : ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి, పనులు 17 నెలలు నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమతులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ.1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

అమరావతి,సెప్టెంబర్3 : ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలకమైన ప్రాధాన్యాన్ని అప్పగించింది. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయనను నియమించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో విస్తృత ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజాసేవ, దేశాభివృద్ధి సహా 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య సేవలను ప్రజల ముందుకు తీసుకురానున్నారు.

## సంపాదకీయం

# ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక !

సింధుజలాలపై గొంతు చించుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదంపై ఒక్కమాటా మాట్లాడ లేదు. రాజకీయాలకు నదీజలాలను వాడుకోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ. సింధూజలాలు ఆపడం వల్ల పాక్‌లో రైతులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ సిందూ జలాలను పాక్‌కు నిలిపివేయడంపై కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. అయితే తమదేశం ఉగ్రవాదనికి మద్దతు ఇవ్వదని ఒక్కమాటా చెప్పలేదు. అయితే ఇదే సందర్భంలో మోడీ పాక్‌పై ఎదురుదాడి చేశారు. ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ రకంగా షెహబాజ్‌కు ఇది ఓ హెచ్చరికల లాంటిది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించ కూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై మోడీ భారత్ గళాన్ని గట్టిగా వినిపించారు. ఇది ఓ రకంగా చెప్పాలంటే హెహబాజ్‌కు సూటిగా తగిలివుంటుంది. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవా దానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియా మకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచిం చారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేప థ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర వాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టు ల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోడీ అన్నారు. అయితే ఇలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశానికి మోడీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్-జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షు డు ఎమోమాలి రహ్మాన్ హాజరయ్యారు. పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధా లను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని ప్రోత్సహిం చడం ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశా లతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకి స్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి. ఈ సదస్సు ద్వారా భారత్ ఎప్పటికప్పుడు ఉగ్రవా దంపై హెచ్చరిస్తూనే ఉంది. ఉగ్రవాదం ప్రపంచాన్ని తుడిచిపెట్టే మహమ్మారి అని కూడా హెచ్చరించారు. పాక్ ఇలాంటి నీతలకు లొంగి వైఖరి మార్చుకుం టుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ఉగ్రవా దులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు.

# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

## ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు



ఖాట్మాండ్,సెప్టెంబర్2 : నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్ జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటి వరకు 1,113 మృతదేహాలకు పోస్ట్‌మార్టం.. చట్టపరమైన గుర్తింపు పక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపులేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటి వరకు 6,541 మందిని రక్షించగా..4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.

## చంద్రబాబు విజన్ తో ఉత్తరాంధ్రకు

# గోదావరి జలాలు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అనకాపల్లి,సెప్టెంబర్ 2 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని తాకాయని, ఇది ముఖ్యమంత్రి, అపర భగీరథుడు చంద్రబాబు దార్శనికత వల్లే సాధ్యమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరడం రాష్ట్ర జలవనరుల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన అభివర్ణించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద సీఎం చంద్రబాబు గోదావరి జలాలకు హారతి పట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానాయుడు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరందించాలన్న చంద్రబాబు ముందుచూపు వల్లే ఈరోజు ఈ ప్రాంత ప్రజల దాహం తీరుతోందని మంత్రి అన్నారు. “2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, 2026 నాటికి లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చాం” అని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలోనే ఏలేరు, పంప, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను, తొమ్మిది జాతీయ రహదారులను దాటుతూ కెనాల్ నిర్మాణంలో ఉన్న క్లిష్టమైన పనులను పూర్తి చేశామని తెలిపారు. కొమ్మరిలోవ వద్ద 100 మీటర్ల లోతైన కొండను తవ్వి కాలువను తీసుకురావడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నిమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంచి చేసే కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రాన్ని ముం చేసిన “గొడ్డలి పార్టీ”కి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిం చాలని కోరుతూ మూడు కీలక విషయాలను ప్రస్తావించారు. “మొదటిది, గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కనీసం ఒక్క తట్ట మట్టి పని చేయలేదు, అరబస్తా సిమెంట్ వాడలేదు, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. అలాంటి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు లేదు” అని ఆరోపించారు. “రెండోది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో పట్టిసీమను ‘వట్టిసీమ’ అని, పురుషోత్తపట్నం పనికిరాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఆ పంపులను పీకేస్తానని హెచ్చరించారు. కానీ ఈరోజు అవే పట్టిసీమ పంపులు కృష్ణా డెల్టా ఆయకట్టును ఆదుకుంటున్నాయి. సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా 32 టీఎంసీల నీటిని అందించాం. అదేవిధంగా, ఆయన పీకేస్తానన్న పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారానే నేడు ఉత్తరాంధ్రకు నీళ్లు వస్తున్నాయి. ఇది చంద్రబాబు ముందుచూపునకు, గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనకు మధ్య ఉన్న తేడా” అని మంత్రి విమర్శించారు. “మూడవది, 2019 నాటికి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశారు. ఆయన అధికారంలో కొనసాగి ఉంటే 2021కే ప్రాజెక్ట్ పూర్తయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, డయాఫ్రం వాల్ ధ్వంసం వంటి చర్యల వల్ల ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే, ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసిన 900 టీఎంసీల వరద నీటిలో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు తరలించేవాళ్లం” అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలుగు జాతి భారీగా నష్టపోయిందని, ఈ ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## పశ్చిమాసియాలో

# మళ్లీ ఉద్రిక్తతలు



- అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు

టెహ్రాన్,సెప్టెంబర్3 : పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది.ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తా మని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయ త్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలి పింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధ వారం తెల్లవారుజాము వరకూ దాడులు కొన సాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు.

## పార్టీలో అభిప్రాయభేదాలు

# సహజమే

### కాంగ్రెస్‌లో కుమ్ములాటలు కొత్తేమీ కావు..

### హద్దులు దాటితే అధిష్టానం చూసుకుంటుంది

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,సెప్టెంబర్ 3 : కాంగ్రెస్ అనేది ఒక విలక్షణమైన జాతీయ పార్టీ అని, పార్టీలో అభిప్రాయభేదాలు, అంతర్గత కొట్లాటలు ఉండటం సహజమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒకరికొకరి మధ్య విభిన్నమైన అభిప్రాయాలు ఉంటాయన్నారు. చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయని, అయితే ఆ చర్చలు లేదా వివాదాలు పరిమితులు దాటితే మాత్రం పార్టీ అధిష్ఠానం కచ్చితంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ...తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే పరిమితం చేయకుండా, అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పుర స్కరించుకుని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సంక్షేమ పాలన అందించారంటూ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామి రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రపతితో నితిన్ నబిన్ భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్2 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్ మర్యాద పూర్వకంగా రాష్ట్రపతిని కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను నితిన్ నబిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారిని మర్యాదపూర్వకంగా కలిశాను. యన సౌమ్య స్వభావం, దేశానికి చేసిన అచంచలమైన సేవ మనకు ఎంతో నేర్పుతాయి. ఆయన మార్గదర్శనం మన దేశం, సమాజం యొక్క ఉన్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయడానికి మనకు నూతన శక్తిని, స్ఫూర్తిని ఇస్తుంది.‘ అని నితిన్ నబిన్ రాసుకొచ్చారు.

# ఐదు దశాబ్దాల కల నెరవేరింది

- చంద్రబాబు సంకల్పంతోనే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- రాష్ట్ర హోం శాఖ మంత్రి, ఎమ్మెల్యే వంగలపూడి అనిత



అనకాపల్లి,సెప్టెంబర్ 3 : ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరాయి. ఈ చారిత్రక ఘట్టంపై రాష్ట్ర హోం శాఖ మంత్రి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పం, అవిశ్రాంత కృషి వల్లే సాధ్యమైందని కొనియాడారు. “నీరు ఉన్నచోటే జీవం, ప్రగతి, అభివృద్ధి ఉంటాయి. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న కలను నిజం చేసిన మహానీయుడు చంద్రబాబు” అని ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అనిత మాట్లాడుతూ.. “పోలవరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు, అదొక జీవనాడి, ఒక ఎమోషన్. మన చిన్నతనం నుంచి వింటున్న పోలవరం ఈరోజు కళ్లముందు సాకారం కావడం చంద్రబాబు దయవల్లే సాధ్యమైంది. ఆలోచనలు ఎవరికైనా వస్తాయి, కానీ వాటిని కార్యరూపంలో పెట్టే దృఢ సంకల్పం, పట్టుదల, దైవానుగ్రహం అన్నీ కలిస్తే ఆరు అడుగుల రూపంలో మన ముందున్న చంద్రబాబు గారు” అని అన్నారు. ఈ బృహత్కార్యంలో చంద్రబాబుకు రాముడి వెంట హనుమంతుడిలా సహకరిస్తున్నారంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనపై అనిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. “2014-19 మధ్య చంద్రబాబు పోలవరం పనులను 72% పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపాటి నేతలు రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నాశనం చేశారు. ఐదేళ్లలో కనీసం 2% పనులు కూడా చేయకుండా ఆటంకాలు సృష్టించారు. ప్రాజెక్టు ఐదేళ్లు ఆలస్యం కావడం అంటే ఒక రైతు జీవితంలో ఐదేళ్ల నిరీక్షణ, ఒక ప్రాంత అభివృద్ధిలో ఐదేళ్ల వెనకడుగు” అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి అసెంబ్లీలో “పోలవరం ఎవరి చేతిలో ప్రారంభం కావాలో రాసిపెట్టి ఉందో, ఆయనే పూర్తి చేస్తారు” అని చెప్పిన మాటలను ఆమె గుర్తుచేశారు. ఆ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరిందని పేర్కొన్నారు. చంద్రబాబును ‘అపర భగీరథుడు’గా అభివర్ణించిన అనిత, “పురాణాల్లో భగీరథుడు గంగ కోసం ఘోర తపస్సు చేశాడు. కానీ మనం గోదారమ్మ తల్లిని ఉత్తరాంధ్రకు తీసుకురావడానికి చంద్రబాబుకు ఒకే ఒక్క ఓటు వేశాం. ఆ ఒక్క ఓటుతోనే నాసిక్‌లో పుట్టిన గోదావరి 180 కిలోమీటర్లు ప్రయాణించి మన పొలాల దాకా వచ్చింది” అని అన్నారు. గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న పాయకరావుపేట, నేడు ఆర్సెలర్ మిట్టల్ వంటి పరిశ్రమలతో పారిశ్రామిక, వ్యవసాయ ముఖద్వారంగా మారిందని తెలిపారు. “ఒకే ఒక్క ఓటు గోదారమ్మను, ఆర్సెలర్ మిట్టల్‌ను, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను, పరిశ్రమలను తీసుకొచ్చింది. సరైన వ్యక్తికి సరైన సమయంలో ఓటు వేస్తే ఇంత అభివృద్ధి జరుగుతున్నప్పుడు, మాకు మరో వ్యక్తికి ఓటేయాలన్న ఆలోచన కూడా రాదు. మీరే మా ముఖ్యమంత్రి, మీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం” అని అనిత ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసే రోజు ఎంతో దూరంలో లేదని, ముఖ్యమంత్రి వెంటే తామంతా నడుస్తామని స్పష్టం చేశారు.

# పేదల సొంతింటి కలకు 'ఇందిరమ్మ' భరోసా..



**-సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం**
**710 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ..**
**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. తొలి విడతలో మంజూరైన ఇళ్లను నిర్ణీత సమయంలో పూర్తి చేసుకున్న లబ్ధిదారుల స్థానంలో నూతనంగా ఎంపికైన 710 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల ద్వారా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని,పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వల్ల పేద కుటుంబాలకు సొంత ఇల్లు సమకూరడంతో పాటు గ్రామాలు, మున్సిపాలిటీల్లో కూలీలకు ఉపాధి, వివిధ వృత్తుల వారికి పని, దుకాణదారులకు వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు . జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు . కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

**రూ.5 లక్షలతో ఇల్లు పూర్తి చేసుకోవాలి**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి కుటుంబం కల అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన విస్తీర్ణంలో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ ఇళ్లను లబ్ధిదారులు సందర్శించి నిర్మాణంపై అవగాహన పొందాలని సూచించారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. నాలుగు దశల్లో ఈ ఆర్థిక సహాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.

రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసినట్లు అన్నారు . పంచాయతీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణ దశలను పరిశీలించి ఫొటోలు తీస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకుని సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# రాజీతోనే న్యాయానికి రాజమార్గం..

**-సమయం, డబ్బు ఆదాతో పాటు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియలకు విముక్తి..**
**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో రాజీ చేసుకోవడమే రాజమార్గమని,రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ అన్నారు. గురువారం జిల్లా కోర్టు సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ల న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం వల్ల ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు.

ముఖ్యంగా ఎన్ఐ యాక్ట్‌కు సంబంధించిన చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని న్యాయవాదులను కోరారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, ఎక్కువ సంఖ్యలో పరిష్కారానికి పంపేలా సహకరించాలని సూచించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులను పరిష్కారానికి పంపేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పి. లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవునూరి రమాకాంతరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్. వెంకయ్యతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ప్రయోగాత్మక, శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని విప్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన విప్ వాటి పనితీరు ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాల ద్వారా అర్థం చేసుకునేలా సైన్స్ ల్యాబ్ దోహదపడుతుందని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా విద్యార్థినుల్లో సృజనాత్మకత, పరిశీలనా శక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు.

అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం విద్యార్థినుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు సాధారణ జ్ఞానం, భాషా పరిజ్ఞానం, పోటీ పరీక్షలకు అవసరమైన అవగాహనను పెంచేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థినులు పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని విప్ తెలిపారు. విద్యా రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలల్లో అవసరమైన



సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని చెప్పారు.విద్యార్థినులు అందుబాటులోకి వచ్చిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు తన వంతు పూర్తి సహకారం నిరంతరం అందిస్తానని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు.



# శ్రీవాణి స్కూల్లో ఘనంగా ఉట్టి కొట్టే కార్యక్రమం

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఇల్లంతకుంట మండల కేంద్రం లోని శ్రీవాణి స్కూల్లో ముందస్తుగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని రగిలించింది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గణగోని శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, సమిష్టి భావనలను అలవర్చవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్ప, సుష్మ, మౌనిక, స్వర్ణ, స్వప్న, శ్రీలత, రవళి, రేణుక, ప్రతిభ, అనిత, కరుణ, ఇన్షిరా, హారిక, బాబు శ్రీకాంత్, శ్రీనివాస్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

## రైతులతో కలిసి ఆందోళన.. యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు




**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ఆందోళన నిర్వహించారు. ముఖ్యంగా యూరియా ఎరువులను రైతులకు సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు.

**"అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు"**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో




విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. వాటి అమలులో ప్రజలను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

**యూరియా కొరతపై రైతుల ఆవేదన**

వ్యవసాయ సీజన్‌లో యూరియా కోసం రైతులు రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళనకారులు తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. యూరియా కొరతను తక్షణమే పరిష్కరించి, ప్రతి రైతుకు అవసరమైన మేరకు ఎరువులు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**యూరియా బ్యాగ్‌తో అంగీ ధరించిన కుంభాల మల్లారెడ్డి ప్రత్యేక ఆకర్షణ**

ఈ ఆందోళనలో కుంభాల మల్లారెడ్డి యూరియా బ్యాగ్‌తో ప్రత్యేకంగా అంగీ తయారు చేసుకుని ధరించడం నిరసనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైతులకు యూరియా అందకపోవడంతో ఎదురవుతున్న పరిస్థితిని ప్రతిబింబించేలా ఆయన వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ దృశ్యం అక్కడున్న రైతులు, నాయకుల దృష్టిని ఆకర్షించింది.

**రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం**

రైతులకు యూరియా, విత్తనాలు, ఇతర వ్యవసాయ అవసరాలు సకాలంలో అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజలు, రైతుల పక్షాన బీఆర్ఎస్ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. థాంక్యా మండల అధ్యక్షుడు వరుస కృష్ణ హరి. ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు, తిమ్మాపూర్ సర్పంచ్ సుభాష్, బండలింగంపల్లి సర్పంచ్ నర్సాగౌడ్, సీనియర్ నాయకులు కుంభాల మల్లారెడ్డి, వెంకట నరసింహారెడ్డి, పరుశురాం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మీసం రాజం, సందీప్, అఫ్సర్ ఉన్నిస్సా, అనసూయ, అజ్జు, జబ్బర్, దేవరాజ్, సుమారు వందమంది కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మానాల పాఠశాలలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు..

**బలగం, రుద్రంగి**

రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణ మాట్లాడుతూ, పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేయడంతో పాటు సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. తిరుపతి, మానస, గౌతమి,వాణి, ప్రియాంక, మంజుల, అలాగే విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులకు లీగల్ అవేర్‌నెస్

**క్రైస్తవులు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : నిర్వాహకులు**



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

క్రైస్తవ సమాజంలో చట్టపరమైన అవగాహన పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవులు, పాస్టర్లు, సంఘ పెద్దలు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చట్టం గురించి అవగాహన ప్రతి పౌరుడికి ఎంతో అవసరమని, ముఖ్యంగా క్రైస్తవులు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, మత స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆస్తి మరియు ఇతర చట్టపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

చాలా సందర్భాల్లో చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు తమకు ఉన్న హక్కులను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా, ఇతరులపై ఆధారపడకుండా, చట్టబద్ధమైన మార్గంలో సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి, సంబంధిత అధికారులను ఎలా సంప్రదించాలి, న్యాయ సహాయం ఎలా పొందాలి అనే విషయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

అలాగే సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు తమ బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. చట్టాన్ని గౌరవించడం, ఇతరుల హక్కులను గౌరవించడం, వివాదాలు తలెత్తినప్పుడు శాంతియుతంగా మరియు న్యాయపరంగా పరిష్కారం కోసం ప్రయత్నించడం ద్వారా సమాజంలో సౌభ్రాతృత్వం, శాంతి నెలకొంటాయని అన్నారు.

**"చట్టంపై అవగాహన ఉంటేనే హక్కులను కాపాడుకోగలం..**

హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకున్నప్పుడే సమాజం బలపడుతుంది" అనే సందేశంతో కార్యక్రమంలో అవగాహన కల్పించారు.

క్రైస్తవ సమాజంలో న్యాయ అవగాహనను మరింత విస్తృతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయి వరకు కొనసాగించాల్సిన అవసరం ఉందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం క్రైస్తవులకు చట్టపరమైన అవగాహన కల్పించడంలో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్, జిల్లాలోని సుమారు 100 మంది పాస్టర్లు పాల్గొన్నారు..



# 420 హామీలు.. 1000 రోజులైనా అమలు ఏవీ..?

**-యాప్‌లలో కాదు.. షాపుల్లోనే యూరియా అందించాలి : బీఆర్ఎస్ నాయకులు**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి రైతు వేదిక వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజబింకార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటీ నరసింహారావు, బొల్లి రామ్మోహన్, మాజీ జెడ్పీటీసీ కోడ్ అంతయ్య, మాజీ ఎంపీపీ పడిగల మానస, రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 420 అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా అందుబాటులో ఉంచడంలోనూ విఫలమైందని విమర్శించారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యాప్‌ల ద్వారా కాకుండా రైతులు నేరుగా షాపుల్లో యూరియా కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.రైతుబంధు, రైతుభరోసా పథకాలను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకులకు నిరసనలు, ధర్నాలు కొత్తేమీ కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న చరిత్ర తమదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై భవిష్యత్తులోనూ పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జపాన్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు సిరిసిల్ల ఐడీటీఆర్ నుంచి శిక్షణ..

బలగం టీవీ, తంగళ్ళపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ, పరిశోధనా సంస్థ (ఐడీటీఆర్)ను జపాన్‌కు చెందిన ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు వచ్చిన ప్రతినిధులు.. హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ, వాహనాల పనితీరును పరిశీలించారు.

జపాన్‌లో డ్రైవర్లకు భారీగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. భారత్, శ్రీలంక, నేపాల్ తదితర దేశాల నుంచి హెవీ వెహికల్ డ్రైవర్లను రిక్రూట్ చేసుకునే ఉద్దేశంతో బృందం ఐడీటీఆర్‌ను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే భారత్‌కు చెందిన సుమారు 10 మంది హెవీ వెహికల్ డ్రైవర్లను జపాన్‌కు పంపినట్లు వెల్లడించారు.

భవిష్యత్‌లో ఐడీటీఆర్‌లో 100 మందికి పైగా డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి, వారికి జపాన్ భాషలోనూ శిక్షణ అందించి.. జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. పురుషులతో పాటు మహిళా డ్రైవర్లను కూడా రిక్రూట్ చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జపాన్ ప్రతినిధులు పేర్కొన్నారు.



# చీర్లవంచ పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమర్థవంతంగా చేపట్టాలి: డీఎంహెచ్‌ఓ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

వేములవాడ మండలం చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ గురువారం అన్ని ప్రోగ్రామ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు.

ముఖ్యంగా అసాంక్రమిక వ్యాధుల (NCDs) నియంత్రణలో భాగంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు, చికిత్స, ఫాలోఅప్ వివరాలను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్‌సీడీ స్క్రీనింగ్ జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.

అదేవిధంగా కాలానుగుణంగా ప్రబలే డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్స్ తదితర వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు వ్యాధుల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు.

పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేందర్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# బలగం టీవీ 108 అంబులెన్స్ వార్తపై వైద్యారోగ్య స్పందన..

## -సాంకేతిక లోపాలే.. ప్రత్యామ్నాయ వాహనంతో సేవలు కొనసాగింపు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

108 అత్యవసర అంబులెన్స్ సేవలపై సెప్టెంబర్ 1న బలగం టీవీలో ప్రసారమైన వార్తపై జిల్లా వైద్యారోగ్య శాఖ స్పందించింది.

ఎల్లారెడ్డిపేటలోని టీఎస్09యూడీ0408 అంబులెన్స్ వెనుక తలుపు తాళం వ్యవస్థలో సమస్య ఏర్పడగా, విడిభాగం అందడంతో సెప్టెంబర్ 2న మరమ్మతులు ప్రారంభించినట్లు తెలిపారు. వీర్నపల్లిలోని టీఎస్09యూడీ1308 అంబులెన్స్‌లో గేర్‌బాక్స్ సమస్యతో వర్క్‌షాప్‌లో మరమ్మతులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీర్నపల్లిలో అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా యూపీ32ఎంఎన్6042 నంబరు గల ప్రత్యామ్నాయ అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. రెండు వాహనాల్లో ఏర్పడినవి తాత్కాలిక సాంకేతిక లోపాలేనని, ప్రజలకు 108 సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.



# గొర్రెల పెంపకదారుల సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి..

## - 189 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని డిమాండ్..

బలగం టీవీ, సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గొర్రెల పెంపకదారుల సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని గొర్రెల పెంపకదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవీఏహెచ్‌ఓ అధికారికి వినతిపత్రం అందజేశారు.

జిల్లాలోని సుమారు 250 గ్రామాల్లో 189 గొర్రెల పెంపకదారుల సొసైటీలు ఉన్నాయని నాయకులు తెలిపారు. ఒక్కో సొసైటీలో 100 మందికి పైగా సభ్యులు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా గొర్రెల పెంపకదారులు, గొల్లకురుమలు కలిపి దాదాపు 70 వేల మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గొర్రెల పెంపకదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యబద్ధంగా కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవారని, జిల్లా విభజన అనంతరం ఇతర జిల్లాల్లో సైతం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. అదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ సొసైటీ ఎన్నికలను వెంటనే నిర్వహించి కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో జక్కుల నాగరాజ్ యాదవ్, బండి దేవేందర్ యాదవ్, చీమల ప్రశాంత్ యాదవ్, వేల్పుల శ్రీకాంత్ యాదవ్, సింగర్ వేణి లచ్చయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు జపాన్ లో డ్రైవర్ ఉద్యోగ అవకాశాలు

## -అర్హులైన యువత ఐడీటీఆర్ లో దరఖాస్తు చేసుకోవాలి..

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

జపాన్ లో అర్హులైన యువతకు డ్రైవర్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జపాన్ సంస్థ ప్రతినిధులు, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ సంస్థ ప్రిన్సిపాల్ దురై మురుగన్ తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జపాన్ సంస్థ ప్రతినిధులు తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ సంస్థలో పర్యటించి.. అక్కడ శిక్షణ, ఇతర అంశాలను పరిశీలించారు.



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి.. ఇంగ్లిష్ భాషలో పట్టు ఉన్న 25 ఏండ్ల వయసు ఉన్న యువత శిక్షణకు అర్హులని తెలిపారు.

యువత తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ సంస్థలో సంప్రదించాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ, ఐడీటీఆర్ ప్రిన్సిపాల్ ఆద్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అర్హులైన వారిని ఎంపిక చేయాలని ఆదేశించారు. ఐడీటీఆర్లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అనంతరం జపాన్ భాషపై తర్ఫీదు ఇస్తారని తెలిపారు.

శిక్షణలో ఎంపికైన వారికి జపాన్ దేశంలో ప్రతి నెలా సుమారు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు వేతనం ఇచ్చే డ్రైవర్ ఉద్యోగ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఐడీటీఆర్ కార్యాలయం ప్రిన్సిపాల్ ఫోన్ నంబర్ 94421 25075లోసంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జపాన్ సంస్థ ప్రతినిధులు ఓసీ బుచి, రాజు కుమార్ తదితరులు ఉన్నారు.

# చెరువులు, రిజర్వాయర్ల సంరక్షణ, అభివృద్ధికి చర్యలు..



## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో గుర్తించిన చెరువులు (వెట్‌ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చెరువులు (వెట్‌ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధిపై అటవీ శాఖ, రెవెన్యూ, నీటి పారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. చెరువులు(వెట్‌ల్యాండ్స్) నీరు నిల్వ ఉండే భూములు ప్రకృతి సమతుల్యతకు కీలకమని, ఇవి భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 164 చెరువులు గుర్తించామని అన్నారు . ఆయా చెరువుల హద్దులు, పూర్తి విస్తీర్ణం, ఎఫ్ టీ ఎల్ ను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ, నీటి పారుదల ఇతర శాఖల సమన్వయంతో సర్వే, మ్యాపింగ్, ఆన్లైన్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వాటి అభివృద్ధి కోసం అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఆయా జల వనరుల అభివృద్ధి, మరమ్మత్తు పనులను అటవీ శాఖ ఆధ్వర్యంలో చేస్తారని పేర్కొన్నారు. దీంతో వలస, స్థానిక పక్షులు, జంతువులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు లో చెరువులు కబ్జా నుంచి రక్షించవచ్చని స్పష్టం చేశారు. మొక్కల, చేపల పెంపకం, పర్యాటక

అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

భూముల రీ సర్వేలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో ఆయా శాఖల అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆద్వర్యంలో జిల్లా సర్వే కొనసాగుతుందని తెలిపారు. అటవీ శాఖ, నీటి పారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన భూముల వివరాలు సర్వే అధికారులకు ఇవ్వాలని, సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. దీంతో ఆయా శాఖల భూముల వివరాలు పక్కాగా నమోదు అవుతాయని వెల్లడించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుతం సర్వే కొనసాగుతున్న గ్రామాల్లో రైతులు పాల్గొనేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్ ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు బీఆర్ఎస్‌వి.. అభివృద్ధి కాంగ్రెస్‌ది

## అసలు బాకీదారులు బీఆర్ఎస్.. కేసీఆర్ రాజీనామా చేయాలి..

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, వేములవాడ:

తెలంగాణ సమాజానికి అసలు బాకీ పడింది కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్ పార్టీయేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో సుమారు 500 మీటర్ల మేర గత బిఆర్ఎస్ పార్టీ వైఫల్యాలు, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారం, దుష్ప్రచారాన్ని ప్రజల ముందు ఎండగట్టేందుకు వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో భారీ ఫ్లెక్సీల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



2014లో తెలంగాణ పేరు మీద అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి భారీ అప్పుల భారాన్ని మిగిల్చిందని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలను ఒకవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరోవైపు ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు .

'బాకీ కార్డు' పేరుతో బీఆర్ఎస్ కొత్త రాజకీయ డ్రామాలకు తెరలేపుతోందని,తెలంగాణకు బాకీ పడింది ఎవరో ప్రజలకు తెలుసని, కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ పాలనలో రాష్ట్రంపై భారీ అప్పుల భారం పడిందని ఆరోపించారు.

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, అధికారం ఉన్నప్పుడు తప్ప ప్రజల మధ్యకు రావడం లేదని,ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల తర్వాత ఎన్నికల్లో ప్రజల ఆదరణ కోల్పోతూ వస్తోందని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం 120కి పైగా కొత్త పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు.

బీసీ కులగణన, పేదలకు గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం, తక్కువ ధరకు వంటగ్యాస్, రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం సరఫరా, రైతులకు ప్రోత్సాహకాలు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు .రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వెయ్యి రోజుల విజయవంతమైన పాలన అనంతరం కూడా తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజల్లో పూర్తిస్థాయిలో ఎండగడుతామని అన్నారు .

# పెద్దూరు పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు అకట్టుకున్నాయి.. ఈ సందర్భంగా అందంగా అలంకరించి, ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్ని కృష్ణులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గోపికలందరూ వారి నృత్యాలతో అలరించారు. శ్రీకృష్ణుడు ప్రవచించిన గీతానుసారం ప్రతి ఒక్కరూ ప్రయత్నలోపం లేకుండా ఎవరి పనిని వారు సక్రమంగా నిర్వర్తించాలని, శ్రీకృష్ణుని జీవితం మనందరికీ ఆదర్శమని, కృష్ణుడు ఆపదలను, కష్టాలను ఎదుర్కొన్న యుక్తి, నైపుణ్యం అందరికీ ఆచరణీయమని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. ఈ వేడుకలలో ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, జంగం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, రఘునందన్ రావ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్ల దీక్షను విజయవంతం చేయాలి

## -హైదరాబాద్‌లో 8న నిరసన దీక్ష..

## -పెద్ద సంఖ్యలో తరలిరావాలి

## -జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి

బలగం టీవీ, బోయినిపల్లి:

రెడ్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం రెడ్ల నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటలకు రెడ్ల నిరసన దీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షను విజయవంతం చేయాలని కోరారు.రెడ్డి బంధువులందరూ ఐక్యంగా పాల్గొని నిరసన దీక్షకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తమ సమస్యలు, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో




రాష్ట్ర రెడ్డి ఐక్య వేదిక సహాధ్యక్షుడు పూర్మనీ లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు డబ్బు తిరుపతి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నారెడ్ల రాఘవరెడ్డి, కంది భాస్కర్‌రెడ్డి, జిల్లా నాయకుడు గుర్రాల రాజిరెడ్డి, మండల రెడ్డి సంఘం నాయకులు తిప్పిరెడ్డి కిషన్‌రెడ్డి, రమణరెడ్డి, వినోద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ఘన విజయం..



### ఆసియా కప్‌లో సెమీస్‌కు టీమిండియా!
### స్మృతి మంధాన రికార్డు సెంచరీ.. తిప్పేసిన స్పిన్నర్లు
### హాంకాంగ్ చైనాపై 137 పరుగుల తేడాతో విజయం

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల టి20 ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయంతో రికార్డు స్థాయిలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన (124) రికార్డు శతకంతో చెలరేగగా, స్పిన్నర్లు దీప్తి శర్మ (3/9), శ్రీ చరణి (2/16) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తిప్పేయడంతో హాంకాంగ్ చైనాను టీమిండియా చిత్తు చేసింది. భారత్ నిర్దేశించిన 194 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో హాంకాంగ్ చైనా 16.2 ఓవర్లలో కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. దీంతో 137 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన హర్మన్‌ప్రీత్ సేన టోర్నీలో నాకౌట్ (సెమీఫైనల్) బెర్తును ఖరారు చేసుకున్న మొదటి జట్టుగా నిలిచింది.

**ఆకాశమే హద్దుగా మంధాన విధ్వంసం:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు షఫాలీ వర్మ (28)తో



కలిసి స్మృతి మంధాన విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చింది. షఫాలీ అవుటయ్యాక ప్రతీకా రావల్ (10), రీచా ఘోష్ (11), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10) త్వరగానే వెనుదిరిగినా, మంధాన ఏమాత్రం తగ్గలేదు. కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసి ఆసియా కప్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులు (10,880 పరుగులు) చేసిన క్రీడాకారిణిగా మిథాలీ రాజ్‌ను అధిగమించి చరిత్రకెక్కింది. ఫలితంగా భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది.

56 పరుగులకే ప్రత్యర్థి ఆలౌట్:

194 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన హాంకాంగ్ చైనాను భారత స్పిన్నర్లు ఆరంభం నుంచే తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ (3/9) హాంకాంగ్ టాప్ ఆర్డర్‌ను దెబ్బతీయగా, శ్రీ చరణి (2/16), నందని శర్మ (2/6), ప్రేమా రావత్ (2/12) వరుస వికెట్లతో చెలరేగారు. దీంతో హాంకాంగ్ బ్యాటర్లలో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు అందుకుని, జట్టు 56 పరుగులకే ఆలౌటైంది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్ తొలి ఇన్నింగ్స్: 193/5 (స్మృతి మంధాన 124, షఫాలీ వర్మ 28; మెరీనా లాంప్లో 2/46).

హాంకాంగ్ చైనా తొలి ఇన్నింగ్స్: 56 ఆలౌట్ (నతాషా మైల్స్ 15, మెరీనా లాంప్లో 14; దీప్తి శర్మ 3/9, శ్రీ చరణి 2/16, నందని శర్మ 2/6, ప్రేమా రావత్ 2/12).

ఫలితం: 137 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం.



# ఆసియా క్రీడలో టీమిండియా హెడ్‌కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్..!

### స్వదేశంలో వెస్టిండీస్ సిరీస్ కారణంగా తప్పుకోనున్న గౌతమ్ గంభీర్
### సహాయక సిబ్బందిని ఖరారు చేసిన బీసీసీఐ.. శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ బరిలోకి!

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల (ఏషియన్ గేమ్స్ 2026) కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగే ఈ మెగా టోర్నీలో ఆడే భారత పురుషుల టీ20 జట్టుకు హెడ్‌కోచ్‌గా భారత క్రికెట్ దిగ్గజం, నేషనల్ క్రికెట్ అకాడమీ (NCA) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నారు. రెగ్యులర్ హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ స్థానంలో లక్ష్మణ్‌ను బాధ్యతల్లో నియమిస్తున్నట్లు క్రీడా మంత్రిత్వ శాఖ ఆమోదించిన కోచింగ్ సిబ్బంది జాబితా ద్వారా ఖరారైంది.

**వెస్టిండీస్ సిరీస్ వల్లే ఈ మార్పు:**

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు జరగనున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో (సెప్టెంబర్ 27 నుంచి) భారత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో 3 వన్డేల సిరీస్ ఆడనుంది. దీంతో సీనియర్ వన్డే జట్టు పర్యవేక్షణ కోసం గౌతమ్ గంభీర్ స్వదేశంలోనే ఉండిపోనుండగా, శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని యువ భారత్‌ను నడిపించేందుకు లక్ష్మణ్ జపాన్ వెళ్లనున్నారు. గతంలో 2023 హంగ్జౌ ఆసియా క్రీడల్లోనూ లక్ష్మణ్ కోచింగ్‌లోనే భారత్ స్వర్ణ పతకం సాధించి డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలవడం విశేషం.

**సహాయక సిబ్బంది ఖరారు:**

లక్ష్మణ్‌తో పాటు సహాయక సిబ్బందిగా మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్‌లను బీసీసీఐ నియమించింది. టీమ్ లీడర్‌గా మరూఫ్ ఫజందార్ వ్యవహరించనున్నారు. ఇక హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు కోచింగ్ విభాగంలో ఎలాంటి మార్పులు చేయలేదు. మహిళల జట్టుకు అమోల్ మజుందార్ హెడ్‌కోచ్‌గా, ఆవిష్కార్ సాల్వి బౌలింగ్ కోచ్‌గా కొనసాగనున్నారు.

# ఆ పనికిమాలిన పుకార్లను ఆపేయండి: బీసీసీఐ సెక్రటరీ

### రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై 'బీసీసీఐ' సెన్సేషనల్ కామెంట్స్!
### ముంబైలో బీసీసీఐ రివ్యూ మీటింగ్.. హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్లు హాజరు

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలకు భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (బీసీసీఐ) సెక్రటరీ దేవజిత్ సైకియా గట్టిగా ముగింపు పలికారు. ముంబైలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. "రోహిత్ శర్మ అన్ని మ్యాచ్‌ల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు, లార్డ్స్ మ్యాచ్‌లోనూ సెంచరీ బాదాడు. ఇకనైనా ఇలాంటి ఆధారాల్లేని పుకార్లకు ప్రాధాన్యం ఇవ్వడం ఆపేయండి" అని స్పష్టం చేశారు.

**భవిష్యత్ ప్రణాళికలు, గాయాలపై సుదీర్ఘ చర్చ:**

దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన ఈ కీలక భేటీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, టెస్ట్-వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌లు హాజరయ్యారు. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలతో పాటు ఆటగాళ్లను వేధిస్తున్న గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్, సేనా (SENA) దేశాల పర్యటనలకు ముందు సరైన విశ్రాంతి, ప్రాక్టీస్ మ్యాచ్‌ల షెడ్యూలింగ్ గురించి ఈ సమావేశంలో ప్రణాళికలు రూపొందించారు. వ్యక్తిగత కారణాల వల్ల చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ భేటీకి దూరంగా ఉన్నట్లు సైకియా వెల్లడించారు.

**ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి:**

గాయాల తీవ్రతపై సైకియా స్పందిస్తూ.. "రెండు నెలల ఐపీఎల్ ఆడిన వెంటనే ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనలకు వెళ్లడంతో ఆటగాళ్లు గాయాలపాలయ్యారు. రాబోయే ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (FTP)లో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనలకు ముందు ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి, మైదాన పరిస్థితులకు అలవాటు పడేలా ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఉండేలా మార్పులు చేస్తాం" అని తెలిపారు. అంతేకాక నేషనల్ సెంటర్ ఫర్ స్పెషలైజ్డ్ ట్రైనింగ్‌లో ఫిట్‌నెస్, పునరావాస సౌకర్యాల కోసం ఇప్పటికే



16 మంది అర్హత గల నిపుణులు అందుబాటులో ఉన్నారని చెప్పారు.

**సమావేశంలో ప్రధానాంశాలు:**

రోహిత్ శర్మ భవితవ్యం: రిటైర్మెంట్ వార్తలు ఒట్టి పుకార్లేనని, ప్రస్తుతం వన్డే ప్రణాళికల్లో కొనసాగుతున్నారని స్పష్టత.

2027 వన్డే ప్రపంచకప్: ప్రపంచకప్ లక్ష్యంగా యువ ఆటగాళ్లకు తగిన అవకాశాలు ఇస్తూ రోడ్‌మాప్ సిద్ధం.

వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్: రాబోయే పర్యటనల్లో ఆటగాళ్లకు విశ్రాంతితో పాటుగా కట్టుదిట్టమైన ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అమలు.

# అగార్కర్ మార్క్ సెలెక్షన్‌పై వసీం జాఫర్ ఆగ్రహం!

### రింకూ సింగ్, కుల్దీప్ యాదవ్‌ల తొలగింపుపై తీవ్ర అసహనం
### 'ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారో సెలెక్టర్లకే తెలియాలి'



బలగం టీవీ, హైదరాబాద్

అజిత్ అగార్కర్ నేతృత్వంలోని టీమిండియా సెలెక్షన్ కమిటీ నిర్ణయాలపై మాజీ ఓపెనర్ వసీం జాఫర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అసలు ఏ ప్రాతిపదికన ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటున్నారో, ఎందుకు తప్పిస్తున్నారో సెలెక్టర్లకే తెలియాలని తీవ్రంగా మండిపడ్డాడు. అఫ్గానిస్థాన్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టులో యువ బ్యాటర్ రింకూ సింగ్, చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌లను పక్కన పెట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టాడు.

రింకూ సింగ్ ఏం పాపం చేశాడు?:

తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందించిన వసీం జాఫర్.. రింకూ సింగ్, కుల్దీప్‌లను ఏ ఉద్దేశంతో తప్పించారో అర్థం కావడం లేదన్నాడు. "ఐపీఎల్‌తో పాటు యూపీ టీ20 లీగ్, దులీప్ ట్రోఫీల్లో రింకూ అద్భుతంగా రాణించాడు. తనకు లభించిన ప్రతి అవకాశంలోనూ జట్టును ఆదుకున్నాడు. అంతగా రాణిస్తున్నా అతనిపై వేటు వేయడం దారుణం. సీనియర్లు పునరాగమనం చేసినప్పుడు ఎవరో ఒకరు తప్పుకోవాల్సిందే కానీ, అసలు ఎలాంటి తప్పు చేయని రింకూను తొలగించడం సరికాదు" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

కుల్దీప్‌కు మళ్లీ అన్యాయమే:

ఇక స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పట్ల సెలెక్టర్లు ప్రవర్తిస్తున్న తీరుపై కూడా జాఫర్ స్పందించాడు. "కుల్దీప్ విషయంలో ప్రతీసారి అన్యాయమే జరుగుతోంది. అతని ప్రతిభను సెలెక్టర్లు ఎందుకు పక్కన పెడుతున్నారో అర్థం కావడం లేదు" అని పేర్కొన్నాడు.

కాగా, సెప్టెంబర్ 13 నుంచి న్యూఢిల్లీ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరిగే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. గాయాల నుంచి కోలుకుంటున్న బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ రెడ్డిలకు చోటు లభించినప్పటికీ, వారు ఫిట్‌నెస్ పరీక్ష క్లియర్ చేయాల్సి ఉంది.

# ఐసీసీ షాక్‌తో శ్రీలంకకు రూ.189 కోట్ల భారీ నష్టం!

### మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం రద్దుతో మూల్యం
### భారత్‌కు దక్కనున్న ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులు?

బలగం టీవీ, హైదరాబాద్

2027 తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రద్దు చేయడంతో శ్రీలంక క్రికెట్ బోర్డుకు (ఎస్ఎల్‌సీ) క్రీడాపరంగానే కాకుండా ఆర్థికంగానూ భారీ తీరని లోటు వాటిల్లింది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల శ్రీలంక దేశానికి సుమారు 20 మిలియన్ల అమెరికన్ డాలర్ల (దాదాపు రూ. 188.95 కోట్లు) మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందని 'శ్రీలంక డైలీ మిర్రర్' పత్రిక తన కథనంలో పేర్కొంది. బోర్డు పాలనలో శ్రీలంక ప్రభుత్వం అనవసరంగా జోక్యం చేసుకోవడమే ఈ ఆర్థిక దెబ్బకు ప్రధాన కారణమైంది.

దెబ్బతిన్న పర్యాటకం, వాణిజ్యం:

ఐసీసీ తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం ద్వారా శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు భారీగా ఊరట లభించేది. ఈ మెగా ఈవెంట్ వల్ల దేశంలో పర్యాటకం (టూరిజం), హోటల్ బుకింగ్స్, రవాణా, హాస్పిటాలిటీ రంగాలతో పాటు వాణిజ్య కార్యకలాపాలు విశేషంగా పుంజుకునేవి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది మంది క్రికెట్ అభిమానులు, వివిధ దేశాల బోర్డు ప్రతినిధుల పర్యటన ద్వారా లభించే విదేశీ మారకద్రవ్యాన్ని శ్రీలంక కోల్పోయింది. అంతేకాకుండా, ఆతిథ్య హక్కుల ద్వారా ఐసీసీ నుంచి నేరుగా లభించే భారీ నిధులు కూడా బోర్డు చేజారిపోయాయి.

భారత్‌కు ఆతిథ్య హక్కులు!:

ప్రస్తుతం శ్రీలంక ప్రభుత్వం నియమించిన 'ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ' ఆధ్వర్యంలోనే బోర్డు కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించి బోర్డును స్వతంత్రంగా మార్చాలని ఐసీసీ ఆదేశించినప్పటికీ, ఆ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో ఐసీసీ ఈ కఠిన చర్య తీసుకుంది. లంకను రేసు నుంచి తప్పించిన ఐసీసీ, ఈ ఆతిథ్య బాధ్యతలను భారత్‌కు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఆశించిన భారీ ఆదాయం చేజారడంతో శ్రీలంక తీవ్ర నిరాశలో మునిగిపోయింది.

# పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు..

బలగం టీవీ, సిరిసిల్ల:

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పోలీస్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎస్ఐ, కానిస్టేబుల్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ సదస్సు ద్వారా ఉపయోగకరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు. సబ్జెక్టుల వారీగా నిపుణులచే శిక్షణతో పాటు పరీక్షల విధానం, సమయపాలన, చదువులో అనుసరించాల్సిన పద్ధతులు, పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధమయ్యే విధానంపై ముఖ్యమైన సూచనలు అందించనున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పోటీ పరీక్షల అభ్యర్థులు జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పోలీస్ శాఖ కోరింది.

**దరఖాస్తుకు సెప్టెంబర్ 6 వరకు అవకాశం..**

సదస్సులో పాల్గొనదలచిన అభ్యర్థులు సెప్టెంబర్ 3 నుంచి సెప్టెంబర్ 6 సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు సదస్సు తేదీ, వేదికకు సంబంధించిన వివరాలను వ్యక్తిగతంగా మెసేజ్ ద్వారా, అలాగే ప్రెస్‌నోట్ రూపంలో తెలియజేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ అందించిన ఆన్‌లైన్ ఫారమ్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

https://docs.google.com/forms/d/e/1FAIpQLSexxUIyP3Zf6gTavKexsE-m-D6HfRGj06g7Qm-l3hqv5LUtwuQ/viewform?usp=publish-editor

ఏవైనా సందేహాలు లేదా పూర్తి వివరాల కోసం తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ కోరింది.

# 100 రోజులన్నారు.. 1000 రోజులు దాటినా హామీలు అమలు కాలేదు

**చీటీ లక్ష్మణరావు**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఎల్లారెడ్డిపేట మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు చీటీ లక్ష్మణరావు విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన "కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట" కార్యక్రమంలో భాగంగా రెండో రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించినప్పటికీ, వెయ్యి రోజులు దాటుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని లక్ష్మణరావు ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో పాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్



పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్మృతి మంధాన ఆల్‌టైమ్ రికార్డు: మిథాలీని దాటేసి టాప్‌లోకి!

### హాంకాంగ్‌పై శతకంతో అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులు
### ఒకే ఇన్నింగ్స్‌లో పలు మైలురాళ్లు.. 137 పరుగులతో భారత్ విజయం



బలగం టీవీ, హైదరాబాద్

మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సరికొత్త చరిత్ర సృష్టించింది. దుబాయ్ వేదికగా హాంకాంగ్‌తో జరిగిన ఆసియా కప్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో మెరుపు సెంచరీతో (64 బంతుల్లో 124; 14 ఫోర్లు, 7 సిక్సర్లు) విరుచుకుపడి ఆల్‌టైమ్ రికార్డులను తన పేరిట లిఖించుకుంది. ఈ క్రమంలో అంతర్జాతీయ మహిళల క్రికెట్ (మూడు ఫార్మాట్లలో కలిపి) చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అగ్రస్థానంలో నిలిచింది. తన 303వ అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో 119 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద భారత మాజీ దిగ్గజం మిథాలీ రాజ్ (10,868 పరుగులు) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును మంధాన దాటేసింది.

**సెంచరీల రికార్డు.. హర్మన్‌ప్రీత్‌నూ దాటేసి:**

ఈ మ్యాచ్‌లో దంచికొట్టిన మంధాన పలు అరుదైన రికార్డులను ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధికంగా 18 సెంచరీలు చేసిన ప్లేయర్‌గా ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ (17 సెంచరీలు) రికార్డును చెరిపివేసింది. అంతేకాకుండా, ఈ ఇన్నింగ్స్‌లో 7 సిక్సర్లు బాదడంతో మహిళల టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గానూ నిలిచింది. దీంతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (89 సిక్సర్లు) ను అధిగమించి, తన టీ20 సిక్సర్ల సంఖ్యను 95కి చేర్చుకుంది.

**దీప్తి శర్మ బౌలింగ్ మేజిక్:**

స్మృతి మంధాన రికార్డు ఇన్నింగ్స్‌తో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 193/5 పరుగులు చేసింది. అనంతరం బౌలింగ్‌లోనూ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (3/9) తిప్పేయడంతో హాంకాంగ్ జట్టు కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ 137 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మూడు ఫార్మాట్లలో కలిపి 362 వికెట్లతో అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా దీప్తి శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

అత్యధిక పరుగుల రికార్డు వివరాలు:

స్మృతి మంధాన (భారత్) – 10,880 పరుగులు
మిథాలీ రాజ్ (భారత్) – 10,868 పరుగులు
సూజీ బేట్స్ (న్యూజిలాండ్) – 10,740 పరుగులు
షార్లెట్ ఎడ్వర్డ్స్ (ఇంగ్లాండ్) – 10,273 పరుగులు
స్టఫానీ టేలర్ (వెస్టిండీస్) – 10,007 పరుగులు

# కాంగ్రెస్ హామీల అమలులో విఫలం: బీఆర్ఎస్ నేతల నిరసన..



బలగం టీవీ, తంగళ్లపల్లి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి రైతు వేదిక వద్ద మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజభింకార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటీ నరసింహారావు, బొల్లి రామ్మోహన్, మాజీ జెడ్పీటీసీ కోడ్ అంతయ్య, మాజీ ఎంపీపీ పడిగల మానస, రాజు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా అందుబాటులో ఉంచడంలో విఫలమైందన్నారు. యాప్‌ల ద్వారా కాకుండా నేరుగా షాపుల్లో యూరియా కొనుగోలు చేసుకునే విధంగా రైతులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతుబంధు, రైతుభరోసా పథకాలను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు దాటినా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.

బీఆర్ఎస్ పార్టీకి ధర్నాలు, నిరసనలు కొత్త కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజల హక్కుల కోసం పోరాడి, మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని వారు గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీలోకి పళ్ల బురుసు

CINEMA




సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ పల్లెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.






# సంకల్ప సాధకుడు పవన్

## తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.

# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్




కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.

# ప్రతి యువకుడి జీవిత ప్రయాణానికి ప్రతీక



యువ హీరో శ్రీ విష్ణు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. ప్రొడక్షన్ నెం.39గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నేటి యువత జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, భావోద్వేగాలు, కల లు, ఆశలు, ఆకాంక్షలు, సవాళ్లను ప్రతిబింబించేలా రూపొందుతోంది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సన్ని వేశాలు, అన్ని రకాల భావోద్వే గాలతో కూడిన ఓ సరికొత్త ప్రయా ణాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ మేకర్స్ తాజాగా ఓ చిన్న గ్లింప్స్‌ను విడుదల చేశారు. యువత జీవితానికి దగ్గరగా ఉండే అంశాలతో రూపొందుతున్న ఈ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచడంతో పాటు, కథ ఎలా ఉండ బోతుందనే విషయంపై మరింత క్యూరియాసిటీని కలిగిస్తోంది. సహజమైన భావోద్వేగాలతో కూడిన ఈ కథ ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఏదో ఒక సందర్భాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. హారికా సూర్యదేవర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్. నాగ వంశీ సమర్పి స్తున్నారు. సన్నీ సంజయ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

# 'మైసా' రిలీజ్ డేట్ ఫిక్స్

గోండ్ గిరిజన మహిళగా అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా సినిమా 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్ ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ స్ట్రాంగ్ పీరియడ్-యాక్షన్ లుక్ ఇచ్చింది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా కొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేసేలా హై-ఆక్టేన్ స్టంట్ కొరియోగ్రఫీతో రూపొందుతోంది. ఫిమేల్ లీడ్ సినిమాలకే కాకుండా భారతీయ యాక్షన్ జానర్ కి కొత్త స్థాయికి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.వీశీజఅవం



# రజనీ అభిమానులకు పండగ




## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల

సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది.ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

